వేదనాభరితం!

పారిశుధ్య కార్మికులకు 6 నెలలుగా అందని వేతనాలు

- పట్టించుకోని అధికారులు
- కుటుంబ పోషణ భారంగా మారిందంటున్న కార్మికులు



తనకల్లులో చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

తనకల్లు: పారిశుధ్య కార్మికులు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. వేతనాలు ఎప్పుడు అందుతాయా అని ఎదురుచూస్తున్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా చెత్త, వ్యర్థాలను సేకరించి సంపద కేంద్రాలకు తరలించడానికి ప్రతి పంచాయతీకి గ్రీన్ అంబాసిడర్లు, సంపద సృష్టి కేంద్రాల వద్ద తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువులు తయారు చేయడానికి గ్రీన్ గార్డులను ప్రభుత్వం నియమించింది. అయితే వీరికి సకాలంలో వేతనాలు అందకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారోనని కార్మికులకు ఎదురుచూపులు తప్పడం లేదు. నెలల కొద్దీ జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు.

పని ఎక్కువ...వేతనం తక్కువ

కదిరి నియోజకవర్గంలోని తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, ఎన్పీకుంట, తలుపుల, కదిరి రూరల్ మండలాలలో దాదాపు 230 మంది గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.6 వేలు చొప్పున గౌరవ వేతనాన్ని పంచాయతీ నిధుల నుంచి చెల్లించాల్సి ఉంది. పారిశుధ్య కార్మికులు ఉదయం నుంచి ఆయా గ్రామాల వీధులు, నివాసాల వద్ద ఉన్న వ్యర్థాలు, చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాల్సి ఉంటుంది. అయితే తమకు శ్రమకు తగిన వేతనాన్ని చెల్లించడం లేదని వారు చెబుతున్నారు. వేతనాలు తక్కువ ఇస్తూ తమతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని వారు వాపోతున్నారు. ఇతర కూలి పనులకు వెళ్లినా రోజుకు రూ. 500లకు పైగానే గిట్టుబాటు అవుతుందంటున్నారు. ప్రభుత్వం తమ పనిభారాన్ని దృష్టి ఉంచుకొని నెలకు రూ. 10 వేలకు వేతనాన్ని పెంచాలని కోరుతున్నారు.

నెల నెలా జీతాలు చెల్లించాలి



నేను కొన్నేళ్లుగా పంచాయితీలో పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తున్నాను. నాకు ఆరు నెలల వేతనం రావాల్సి ఉంది. అధికారులను అడిగితే అదిగో ఇదిగో అంటున్నారు. జీతాలు నెల నెలా ఇవ్వకపోతే మేము ఎలా బతకాలి. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి. అధికారులు నెల నెలా వేతనాలు చెల్లించాలి.

– రామాంజనేయులు, పారిశుధ్య కార్మికుడు, తనకల్లు

మా గోడు పట్టించుకునే వారే లేరు



నా మీదే మా కుటుంబం ఆధారపడి ఉంది. అయితే ఆరు నెలలుగా జీతాలు లేకపోవడంతో పూట గడవడం కష్టంగా మారింది. మా బాధలు ఎవ్వరికి చెప్పుకోవాలి. మా గోడు పట్టించుకోనే వారే లేరు. పై అధికారులు స్పందించి మాకు రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలి.

– శాంతప్ప, పారిశుధ్య కార్మికుడు, తనకల్లు

త్వరలోనే వేతనాలు చెల్లిస్తాం

పంచాయితీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలను త్వరలోనే చెల్లిస్తాం. ఇప్పటికే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పంచాయతీలకు నిధులు జమ కాగానే పారిశుధ్య కార్మికులకు జీతాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

– కే. రామానాయక్, ఎంపీడీఓ, తనకల్లు:

క్లుప్తంగా

జీవరాశులకు ప్రాణదానం చేయండి



రత్నాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న భాస్కర్‌నాయుడు

పుట్టపర్తి టౌన్: కరవు జిల్లాలో అడవులు తగలబడకుండా రక్షించడానికి ఆర్థిక సాయం చేసి కోట్ల జీవరాశులకు ప్రాణదానం చేయాలని పర్యావరణ వేత్త భాస్కర్‌నాయుడు శ్రీసత్యసాయి సెంట్రల్‌ట్రస్ట్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌ను కోరారు. పుట్టపర్తిలోని నివాసంలో రత్నాకర్‌ను మార్యద పూర్వకంగా కలసి అడవుల సంరక్షణపై విపతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏటా జిల్లా వ్యాప్తంగా లక్షల ఎకరాల అడవులు అగ్నికి ఆహుతవుతుండడంతో కోట్ల మొక్కలు, జీవరాశులు కాలిపోతూ తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఉమ్మడి జిల్లాలో యూనివర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలు తిరిగి పర్యావరణ ప్రాముఖ్యత వివరిస్తూ విద్యార్థులతో లక్షల మొక్కలు నాటించామన్నారు.

యూరియా పంపిణీ



యూరియా కోసం బారులు తీరిన రైతన్నలు

ఎన్పీకుంట: వెలిచలమల రైతు సేవా కేంద్రం పరిధిలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా 280 బస్తాలు(12 మెట్రిక్ టన్నులు) యూరియాను ఒక్కో రైతుకు రెండు బస్తాలు చొప్పున 140 మంది రైతులకు పంపిణీ చేసినట్లు ఏఓ లోకేశ్వర రెడ్డి తెలిపారు. కాగా ఒక్కో రైతుకు రెండు బస్తాలే పంపిణీ చేస్తుండటంతో రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. కార్యక్రమంలో ఎస్ఐ వలిబాషా, హోంగార్డు రాజు, ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

సేవాభావం అవసరం



పుస్తకాలు,పెన్నులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: ప్రజలకు సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని విశ్రాంత ఉపాధ్యాయుడు మాధవరెడ్డి, సామాజిక కార్యకర్త తలమర్ల మారుతీరెడ్డి అన్నారు. శనివారం వారు తలమర్లలోని ప్రభుత్వం ఎంపీపీ పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి నాలుగు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కిషోర్, రాకేష్ పాల్గొన్నారు.


పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



నూతన అధ్యక్షులను సన్మానించిన దృశ్యం

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అనుబంధ సంఘాల అధ్యక్షులుగా నియమితులైన రమేష్ యాదవ్, జరిపిటి రామచంద్ర, మహబూబ్ ఖాన్, వెంకటేష్, కోలార్ షేక్ మహమ్మద్ హుస్సేన్, షకీల్, కుంచెపు మీనాకుమారి, నాగేంద్రకుమార్‌రెడ్డి, పట్నం షాహీద్‌ఖాన్, మోహిద్దీన్‌ను ఘనంగా సన్మానించారు.

బెస్ట్ ఎమర్జింగ్ స్కూల్‌గా 'రిషి'



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న రిషి పాఠశాల యాజమాన్యం

ధర్మవరం రూరల్: పట్టణంలోని రిషి పాఠశాల జాతీయ స్థాయిలో బెస్ట్ ఎమర్జింగ్ అవార్డును దక్కించుకున్నట్లు డీన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ అవార్డును తీసుకున్న ఏకైక పాఠశాల అన్నారు. అత్యుత్తమ ప్రైవేట్ పాఠశాలలను గుర్తించడానికి దేశ వ్యాప్తంగా సర్వే నిర్వహించిన సిఫోర్ పరిశోధన సంస్థ బెస్ట్ ఎమర్జింగ్ పాఠశాలగా గుర్తించిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించడానికి ఉత్తమ పద్ధతులను అనుసరిస్తామని హెచ్ఎం కరణ్ స్వరూపా సింగ్ తెలిపారు. కార్యక్రమంలో సీఏఓ రవీంద్ర, ఏఓ రంగారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

తాడిమర్రి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరుగుతుందని ఎంపీడీఓ వెంకట రంగారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న సమావేశంలో అధికారులు, కార్యదర్శులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, గ్రామ సర్పంచులు తదితర ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు. ఉదయం 10:30 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు.

విద్యుత్ ఉద్యోగి భూ దందా

- పొలంలోకి రానీయకుండా ఇబ్బందులు
- గోడు వెల్లబోసుకుంటున్న రైతు శంకర్ నాయక్

సాక్షి, పుట్టపర్తి: విద్యుత్ శాఖలో పని చేసే ఉద్యోగి జయరామ్‌నాయక్.. పొలంలోకి వెళ్లనీయకుండా ఇబ్బందులు పెడుతున్నారని గోరంట్ల మండలం కరావులపల్లి తండాకు చెందిన రైతు శంకర్‌నాయక్, ఆమె భార్య జయబాయి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం పుట్టపర్తిలో శంకర్‌నాయక్ మీడియాతో మాట్లాడారు. సమీప బంధువైన జయరామ్‌నాయక్.. కొన్నేళ్లుగా తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించే యత్నం చేస్తున్నాడన్నారు. రెవెన్యూ అధికారుల తప్పిదాలతో తమకు అన్యాయం జరిగిందన్నారు. పుట్టపర్తి ఆర్డీఓ కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. అయితే పొలంలోకి వెళ్లనీయకుండా బెదిరిస్తున్నారని.. బయటికి వెళ్లాలంటే అతడి నుంచి హాని ఉందని.. గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. విచారణ అనంతరం గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో జయరామ్‌నాయక్‌పై కేసు నమోదయిందన్నారు. అయినా పొలంలోకి వెళ్లనీయకుండా బెదిరిస్తున్నారన్నారు.

వాటా ఇవ్వకుండా..

గోరంట్ల మండలం మందలపల్లి రెవెన్యూ పొలం సర్వే నంబర్లు 343, 523-2, 523-3బి, 523-3లో మొత్తం 12.62 ఎకరాలు పైగా ఉంది. అందులో జయరామ్ నాయక్, శంకర్‌నాయక్‌కు సమానంగా వాటా రావాల్సి ఉంది. అయితే జయరామ్‌నాయక్.. తానొక్కడే రెవెన్యూ రికార్డుల్లో భూమిని ఎక్కించుకుని మోసం చేసినట్లు శంకర్‌నాయక్ ఫిర్యాదు చేశాడు. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ చేసి భాగ పరిష్కారం చేసుకోవాలన్నా.. జయరామ్‌నాయక్ ముందుకు రావడం లేదని శంకర్‌నాయక్ వాపోయాడు.

ఇద్దరు విద్యార్థుల అదృశ్యం




బి.భరత్ రాజ్ ,డి.లోకేష్

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయానగర్‌లోని ఎల్లార్జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులిద్దరు అదృశ్యమయ్యారు. పాఠశాల హాస్టల్‌లో ఉంటున్న వారు శనివారం ఉదయం ఎటో వెళ్లిపోయారు. వివరాల్లోకి వెళితే.. అనంతపురంలోని గంగానగర్‌కు చెందిన బి.దివాకర్ కుమారుడు బి.భరత్ రాజ్, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన డి.రవినాయక్ కుమారుడు డి.లోకేష్ నాయక్ చిన్మయానగర్‌లోని ఎల్లార్జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 8వ తరగతి చదువుతూ..అక్కడే వసతి గృహంలో ఉంటున్నారు. ఇద్దరు విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు పాఠశాల వసతి గృహం నుంచి ఎక్కడికో వెళ్లిపోయారు. హాస్టల్ సిబ్బంది కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు శనివారం రాత్రి రాప్తాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిస్తే సెల్: 9440796817లో సమాచారమివ్వాలని సీఐ టీవీ.శ్రీహర్ష సూచించారు.

కుమార్తెతో పాటు వివాహిత అదృశ్యం

కొత్తచెరువు భర్తతో గొడవపడి కుమార్తెతో పాటు ఓ మహిళ అదృశ్యమైంది. పోలీసుల వివరాల మేరకు.. పెనుగొండ మండలం చెర్లోపల్లికి చెందిన ఎం.సుధాకర్ ఆరోగ్యం బాగలేక ఆస్పత్రికి వెళ్లే క్రమంలో అతడి భార్య అంజలి, కూతురు భావన ఈ నెల 12న కొత్తచెరువు మండలం సాయినగర్‌లో నివాసం ఉంటున్న బంధువు టి. రామాంజనేయులు ఇంటికి వచ్చారు. ఆ రోజు రాత్రి దంపతులు గొడవపడ్డారు. ఈ క్రమంలో తెల్లవారుజామున కూతురుతో కలసి అంజలి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

విద్యార్థినికి మిత్రుల చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీసత్యకృప మహిళా డిగ్రీ కళాశాలలో కాలేయ సమస్యతో బాధపడుతున్న విద్యార్థిని షబీనాకు నిర్వాహకులు, విద్యార్థినులు రూ.80వేల ఆర్థిక సాయం శనివారం అందించారు. కరస్పాండెంట్ వంశీకృష్ణ, ప్రిన్సిపాల్ మల్లికార్జున మాట్లాడుతూ షబీనా కాలేయ సమస్యతో కొంతకాలంగా బాధపడుతోందన్నారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని సెయింట్‌జాన్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ వైద్యులు పరీక్షించి వైద్యం చేయాలంటే రూ.25 లక్షలు ఖర్చవుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ధర్మవరం రూరల్: పోతుకుంట బృందావని కాలనీ, పోతుకుంట, రేగాటిపల్లి, కామిరెడ్డిపల్లి, కుణుతూరు, ముచ్చురామి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ జానకి రామయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైను మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కనగానపల్లి: మామిళ్లపల్లి, కనగానపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ గ్రామాల పరిధిలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కొండారెడ్డి శనివారం తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందిస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని దాడితోట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి ఎస్.నిహారిక, పీ.జయశ్రీ, రాజకుమారి, పదో తరగతి జీ.లక్ష్మీ ప్రణతి, వీ.మిథాలి గత 11, 12 తేదీల్లో బుక్కపట్నం డైట్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ జానపద నృత్యం విభాగంలో వీరి బృందం ప్రతిభ కనబరిచి, మొదటి బహుమతి సాధించారు. విజయవాడలో అక్టోబర్ 24, 25 తేదీలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నట్లు హెచ్ఎం ఉమామహేష్‌బాబు, పీడీ విజయలక్ష్మి తెలిపారు. అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఈనెల 9న జరిగిన సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ సెలక్షన్ ట్రయల్స్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థులు వీ.మిథాలి, అభిరామ్ చక్కని ఆటతీరు ప్రదర్శించి, జిల్లా జట్టుకు ఎంపికయినట్లు పీఈటీ జయలక్ష్మి తెలిపారు.

కేసుల రాజీకి లోక్ అదాలత్ చక్కటి వేదిక



పుట్టపర్తిలో లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి సయ్యద్



ధర్మవరంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

పుట్టపర్తి అర్బన్: రాజీ కాదగిన కేసులకు లోక్ అదాలత్ చక్కటి వేదిక అని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ అన్నారు. శనివారం పుట్టపర్తి కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఐపీసీ 14 కేసులు, మద్యం కేసులు 43, చెక్ బౌన్స్ కేసులు మూడు, బ్యాంక్ కేసులు నాలుగు మొత్తం 64 కేసులను పరిష్కరించారు. సివిల్, ఎక్సైజ్, క్రిమినల్ ఫైన్, చెక్ బౌన్స్ బ్యాంక్ ప్రీ లిటిగేషన్ కింద మొత్తం రూ11.82 లక్షల విలువైన వివిధ తగాదాలకు పరిష్కారం చూపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, రాజేంద్రప్రసాద్, అతావూర్ రెహమాన్, వెంకటరమణప్ప, యదుభూషణ, కృష్ణప్రసాద్, భారతి రెడ్డి, శ్రీనివాసులు, సతీష్‌రెడ్డి, క్రిమినల్ క్లర్క్ మంజునాథ్, సివిల్ క్లర్క్ జ్యోతిబాయి, ఎంఎల్ఏసీ లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

ధర్మవరం అర్బన్: రాజీమార్గమే రాజమార్గమని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి బొజ్జప్ప తెలిపారు. శనివారం ధర్మవరం కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో 28 కేసులు పరిష్కరించారు. ప్రీ లిటికేషన్ కేసులు 8 (రూ.5.57లక్షలు), సివిల్ కేసులు 3(రూ.50 వేలు), చెక్ బౌన్స్ కేసులు 4 (రూ.17.50 లక్షలు), ఎక్సైజ్ కేసులు 2 (రూ.16,500), ఐఎఫ్‌సీ కేసులు 11 మొత్తం 28 కేసులు పరిష్కరించినట్లు జడ్జిలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు డీఎల్ఎస్ మూర్తి, బిల్లే రవీంద్ర, వెంకటరామిరెడ్డి, పెద్దన్న, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

హిందీ పండిట్లకు సన్మానం



శ్రీ ఉషోదయ పాఠశాలలో హిందీ పండిట్లను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం: పట్టణంలోని శ్రీఉషోదయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో హిందీభాషా దినోత్సవం సందర్భంగా హిందీ పండిట్లను శనివారం సన్మానించారు. ఉషోదయ పాఠశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో హిందీ పండితులు జయరాం, మహేష్‌ను సత్కరించారు. అనంతరం విద్యార్థులతో హిందీభాషపై నాట్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రభాకర్, సుబ్బారావు, హెడ్‌మాస్టర్ నాగభూషణం, శంషాద్‌బేగం, ఇన్‌చార్జ్ బినోయ్ ఫ్రాన్సిస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు



రాగన్నగారిపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య

సాక్షి ఎఫెక్ట్..

నల్లచెరువు: ఉప్పార్లపల్లి, రాగన్నగారిపల్లి గ్రామాల్లో మండల వైద్యాధికారి అలేఖ్య ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పటు చేశారు. వణికిస్తున్న విషజ్వరాలు శీర్షికన శనివారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన మండల వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య పై గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. మురుగు నీరు, చెత్త ఉన్న ప్రాంతాల్లో దోమల వ్యాప్తి చెందకుండా అబేట్ మందును పిచికారి చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్ మహబూబ్ బాషా, సుధాకర్, పీహెచ్ఎం భారతి, హెల్త్ అసిస్టెంట్ ముస్తఫా, ఏఎన్ఎంలు యోగేశ్వరి, నరసమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న టూటౌన్ సీఐ రెడ్డప్ప

ధర్మవరం అర్బన్: ధర్మవరం రైల్వేస్టేషన్‌లో టూటౌన్ సీఐ రెడ్డప్ప శనివారం తనిఖీలు చేశారు. రైల్వేస్టేషన్‌లో తిరుగుతూ పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అవాంఛనీయ ఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉందా.., ఎవరైనా అనుమానితులు తిరుగుతున్నారా? అని ప్రత్యేక నిఘా ఉంచారు. రైల్వేస్టేషన్ ప్రాంగణంలో వాహనాలు, లగేజీలను పోలీసులు తనిఖీ చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కూలిన ఇంటి పైకప్పు

బత్తలపల్లి: అనంతసాగరంలో గుజ్జల శ్రీరాములుకు చెందిన ఇల్లు కూలింది. వివరాలు.. అనంతసాగరానికి చెందిన గుజ్జల శ్రీరాములు భార్యతో కలిసి బత్తలపల్లిలో తోపుడు బండిపై కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంటి పైకప్పు కారుతుండడంతో చౌడు (ఒండుమట్టి) వేయాలని గ్రామస్తులను పిలిపించుకున్నారు. భోజన విరామంలో అందరూ మిద్దెపై నుంచి కిందకు వచ్చారు. ఇంతలో ఉన్నపళంగా ఇంటి పైకప్పు కూలబడింది. ఇంట్లోని సామగ్రి ధ్వంసమైంది. అయితే త్రుటిలో ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. బాధితుడు స్థానిక వీఆర్ఓ సాయిప్రకాష్‌కు విషయం తెలియజేశాడు.

రేపటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా 14 పంచాయితీ గ్రామాల్లో సోమవారం నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నెల రోజుల పాటు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల వేయనున్నట్లు పశు వైద్యాధికారి కేశవనాయక్ శనివారం తెలిపారు. పశు యజమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

యువకుడికి గాయాలు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నేకొత్తపల్లికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డి శనివారం ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా పెనుకొండ వైపు నుంచి వస్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడి కాలుకు గాయాలు కాగా, స్పందించిన స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో మరింత జోష్

ధర్మవరం రూరల్: వైఎస్సార్‌సీపీ అధిష్టానం పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి, అనుబంధ విభాగాల్లో చోటు కల్పించింది. ధర్మవరం మండల వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగ అధ్యక్షులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంపిక చేసినట్లు ఆ పార్టీ నాయకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. యూత్ వింగ్ అధ్యక్షుడిగా గిరక శివ, మహిళా విభాగం బి.ప్రవీణ, రైతు విభాగం పాటిల్ శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ టి.లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ ఎస్.రాంగోపాల్, ఎస్టీ సెల్ డి. ప్రవీణ్‌నాయక్, మైనార్టీ సెల్ బాబా పక్ృద్దీన్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఎస్.నారాయణస్వామి, స్టూడెంట్ వింగ్ బిల్లే శ్రీనివాసులు, పంచాయతీరాజ్ వింగ్ డి. వెంకటరామిరెడ్డి, ఆర్‌టీఐ వింగ్ టి. వెంకటేష్, వలంటీర్స్ వింగ్ షేక్ షరీఫ్, గ్రీవెన్స్ సెల్ జి. శ్రీనివాసరెడ్డి, వాణిజ్య విభాగం ఎం.చంద్ర, వీవర్స్ వింగ్ వి. నాగరాజు, వైఎస్సార్‌టీయూసీ ఎస్.సూర్య నారాయణ, అంగన్‌వాడీ విభాగం ఆర్. ప్రభావతి, లీగల్ సెల్ జె. చరణ్ కృష్ణ, కల్చరల్ వింగ్ డి. ప్రకాష్, సోషల్ మీడియా వింగ్ బి. సుదర్శన్‌రెడ్డి, ఐటీ వింగ్ ఆర్. కళ్యాణ్‌రెడ్డి, దివ్యాంగుల వింగ్ ఎస్. మారెన్న, ఇంటలెక్చువల్ ఫోరం బి. నాగానందరెడ్డి, పోలింగ్ బూత్ కమిటీ మురళీమోహన్‌రెడ్డి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా బి. హరికృష్ణను ఎంపిక చేశారు.

తాడిమర్రి: తాడిమర్రి మండల అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు పార్టీ నియోజక వర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి కార్యాలయ సిబ్బంది తెలిపారు. మండల యూత్ అధ్యక్షుడిగా మోదుగులకుంట సిద్దే మోహన్‌రెడ్డిని నియమించారు. మహిళా విభాగం మండల అధ్యక్షురాలుగా ఏ.అశ్విని, రైతు విభాగం మండల అధ్యక్షులుగా మోదుగులకుంట సిద్దే రామకృష్ణారెడ్డి, బీసీసెల్ విభాగం మండల అధ్యక్షులుగా కొండారుపల్లి విశ్వనాథ్, ఎస్టీసెల్ విభాగం మండల అధ్యక్షులుగా నార్శింపల్లి గుజ్జల నరసింహులు, మైనార్టీ సెల్ యూ.బాబ్‌జాన్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ విభాగం ఎస్.ప్రకాష్, స్టూడెంట్ విభాగం ఎం.మదన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ ఆర్.నాగిరెడ్డి, ఆర్టీఐ వింగ్ పీ.చౌరెడ్డి, వలంటీర్స్ వింగ్ ఎం.శ్రీనివాసులు, గ్రీవెన్స్ సెల్ పీ.రామాంజనేయులు, వాణిజ్య విభాగం ఎం.మల్లికార్జున, వీవర్స్ వింగ్ యూ.బాబాఫకృద్దీన్, వైఎస్సార్ టీయూసీ సీ.ఆదినారాయణ, అంగన్‌వాడీ వింగ్ ఏ.వెంకట రమణమ్మ, లీగల్ సెల్ బీ.నరసింహుడు, కల్చరల్ వింగ్ జీ.రామచంద్ర, సోషల్ మీడియా వింగ్ జే.రవితేజ, ఐటీ వింగ్ ఏ.పరమేశ్వర్‌రెడ్డి, దివ్యాంగుల విభాగం ఎం.నారాయణస్వామి, ఇంటెలెక్చువల్ ఫోరం ఏ.సాయినాథ్‌రెడ్డి, బూత్ కమిటీ వింగ్ ఎం.నరసింహులు, పబ్లిక్ వింగ్ డీ.నారాయణ స్వామి తదితరులను అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమించారు.

బత్తలపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బత్తలపల్లి మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. యూత్ విభాగం మండల అధ్యక్షులుగా కె.శేఖర్, మహిళా విభాగం యం.రమాదేవి, రైతు విభాగం యు.కృష్ణమోహన్‌రెడ్డి, బీసీ సెల్ యం.నరసింహులు, ఎస్సీ సెల్ యం.రామాంజనేయులు, ఎస్టీ సెల్ జి.ఆదినారాయణ, మైనార్టీ సెల్ ఎస్.షాషు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఎస్.ఓబులేసు, విద్యార్థి విభాగం కె.చైతన్యరెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ వై.రాజవీరారెడ్డి, ఆర్టీఐ వింగ్ బ్యాల్ల పెద్దయ్య, వలంటీర్స్ వింగ్ యం.పెద్దన్న, గ్రీవెన్స్ సెల్ కాశప్ప, వాణిజ్య విభాగం టి.పోతలయ్య, వీవర్స్ వింగ్ బి.నారాయణస్వామి, వైఎస్సార్‌టీయూసీ టి.సోమశేఖర్, అంగన్‌వాడీ విభాగం బి.అరుణ, లీగల్ సెల్ యం.శ్రీరాములు, కల్చరల్ వింగ్ కె.ఈశ్వరయ్య, సోషల్ మీడియా వింగ్ పి.ఈశ్వరయ్య, ఐటి వింగ్ వి.లోక్‌నాథరెడ్డి, దివ్యాంగుల విభాగం యం.నాగేంద్ర, ఇంటలెక్చువల్ ఫోరం బి.పురుషోత్తమరెడ్డి, బూత్ కమిటీ వింగ్ బి.ప్రసాద్‌రెడ్డి, పబ్లిసిటీ వింగ్ జి.రాంభూపాల్‌రెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మున్సిపల్ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కదిరి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కదిరి మున్సిపల్ అనుబంధ విభాగ అధ్యక్షులను నియమించారు. యూత్ వింగ్ అధ్యక్షుడిగా నాగరాజు బాబా ఫక్రుద్దీన్, మహిళా విభాగం షేక్ సలీమా, రైతు విభాగం మాచిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, బీసీ సెల్ వనం రామాంజనేయులు, ఎస్సీ సెల్ నిషాని చిన్న రెడ్డెప్ప, ఎస్‌టీ సెల్ కె.బాబు నాయక్, మైనార్టీ సెల్ పట్నం సాదత్ అలీఖాన్, క్రిష్టియన్ మైనార్టీ సెల్ ఎం.చెన్నారెడ్డి, స్టూడెంట్ వింగ్ నాగూరి సాయి నిఖిల్‌రెడ్డి, మున్సిపల్ విభాగం వెంకటగిరి అవేంద్ర, ఆర్‌టీఐ విభాగం జి.వీరాంజనేయాచారి, వలంటీర్స్ వింగ్ చిలకల రాజేష్, గ్రీవెన్స్ సెల్ షేక్ ఫయాజ్‌బాషా, వాణిజ్య విభాగం పి.మహమ్మద్ షకీల్, వీవర్స్ వింగ్ మచ్చా పవన్‌కుమార్, వైఎస్సార్‌టీయూసీ ఎంఎస్ ముస్తఫా, అంగన్‌వాడీ వింగ్ వి.విజయలక్ష్మి, కల్చరల్ వింగ్ ఎస్.మనోజ్‌ప్రభాకర్, సోషల్‌మీడియా వింగ్ షేక్ ఇర్ఫాన్‌బాషా, దివ్యాంగుల విభాగం-జెండామాను ఇంతియాజ్, డాక్టర్స్ వింగ్ పసుపులేటి పవన్‌కుమార్ నాయుడు, బూత్ కమిటీ వింగ్-గోరంట్ల ఎహసాన్, పబ్లిసిటీ వింగ్-ఆసాది దినేష్‌కుమార్‌లను నియమించారు.

ముదిగుబ్బ అనుబంధ విభాగ అధ్యక్షుల ఎంపిక

ముదిగుబ్బ: ముదిగుబ్బ మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్లు ఆ పార్టీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. యూత్ వింగ్ అధ్యక్షుడిగా జి. మనోహర్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా జి. లక్ష్మీదేవి, రైతు విభాగం అధ్యక్షుడిగా ఎం. మాధవరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎంసీ శ్రీనివాసులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పి. నారాయణ, ఎస్టీ సెల్ నారాయణస్వామి నాయక్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎస్. అల్లా బకాష్, క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడిగా జి. దామోదర్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా టి. ప్రశాంత్‌కుమార్, పంచాయతీ వింగ్ అధ్యక్షుడిగా ఎం. యోగీశ్వర్‌రెడ్డి, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా కె.చంద్రశేఖర్‌రెడ్డి, వలంటీర్స్ వింగ్ అధ్యక్షులుగా డి. నారాయణస్వామి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా ఎస్. బాబా పక్రుద్దీన్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా పి. నరేష్, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా బి. నరసింహులు, వైఎస్‌ఆర్‌టీయూసి అధ్యక్షులుగా బి. మురళి, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షులుగా ఆర్.మమత, లీగల్ సెల్ కేపీ కుల్లాయప్ప నాయక్, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా పి.ఆదినారాయణ, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా జి. గంగాధర్, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా పవన్‌కుమార్‌రెడ్డి, దివ్యాంగుల విభాగం జి. శ్రీనివాసులు, డాక్టర్స్ వింగ్ ఎస్, బాషా, బూత్ కమిటీ వింగ్ మహమ్మద్ రఫీ, ఇంటలెక్చువల్ ఫోరం ఎస్, ప్రభాకర్‌రెడ్డి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా టి. ఉదయ్‌లను ఎంపిక చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ధర్మవరం రూరల్: మండలంలోని ఆకుతోటపల్లిలో శనివారం సంఘ సంస్కర్త కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 16వ వార్డు కౌన్సిలర్ కేత లోకేష్ తల్లి కేత అచ్చమ్మ జ్ఞాపకార్థం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రజనీ ట్రస్టు వ్యవస్థాపకుడు కన్నా వెంకటేష్, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సొసైటీ సామాజిక విభాగం సలహాదారు సత్య నిర్ధారణ్, గ్రామ పెద్దలు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.